ప్రజాశక్తి
సోమవారం 17 జులై 2023
5
విజయనగరం



రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైఎస్ఆర్ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సూర్య నగర్‌లో గల యూనియన్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బికెవి ప్రసాద రావు మాట్లాడుతూ నిరంతర విద్యుత్ అందించే విద్యుత్ ఉద్యోగులు తమ సామాజిక భాద్యతగా రక్త దానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. మిగతా శాఖలలో ఉద్యోగులుకూడా తమవంతుగా రక్తదాన కార్యక్రమాలు చేయాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో రక్త దాతల అవసరం పెరిగిందని, తమ సంస్థ నుంచి కూడా రక్త దానం అవసరాన్ని విస్తతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డోల చిరంజీవులు, రంగరాజు, మీగడ మహేశ్వరరావు తో పాటు అధికసంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు.

ఉద్దవోలులో ఉద్రిక్తత

- నిందితుల ఇళ్లపై దాడికి గ్రామస్తుల యత్నం
- గ్రామంలో పికెట్ ఏర్పాటు
- ఆందోళనల నడుమ ఉపాధ్యాయుడి అంత్యక్రియలు
- నలుగురు నిందితుల అరెస్టు
- మరొకరి కోసం గాలింపు
- రెక్కీ నిర్వహించి హత్య : ఎస్‌పి

ప్రజాశక్తి-బొబ్బిలి, బాడంగి

హత్యకు గురైన ఏగిరెడ్డి కృష్ణ మృతదేహానికి తీవ్ర ఉద్రిక్తతలో నడుమ ఆదివారం స్వగ్రామం ఉద్దవోలులో అంత్యక్రియలు జరిగాయి. కృష్ణ పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు అధిక సంఖ్యలో గ్రామస్తులు, అభిమానులు తరలివచ్చారు. ఉపాధ్యాయుడు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ విలపించారు. అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, మండల నాయకులు హాజరయ్యారు. కృష్ణ హత్యను జీర్ణిఇంచుకోలేని ఆయన బంధువులు, గ్రామస్తులు నిందితుల ఇళ్లపై దాడులు చేశారు. గడ్డి కుప్పలకు నిప్పు పెట్టారు. ప్రత్యర్థుల కారు, ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. దాడి విషయం పోలీసులకు తెలియడంతో ఉద్దవోలులో భారీ బందోబస్తు నిర్వహించారు. ఉద్రిక్తత పరిస్థితులను అదుపు చేశారు. ఆందోళనకారుల నుంచి పోలీసులు పెట్రోల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.



నిందితుల ఇళ్లపై దాడి చేస్తున్న ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు

సచివాయం వివాదంతో మరింత కక్ష

ఉద్దవోలు సచివాలయాన్ని చెరువు గర్భంలో ప్రత్యర్థి గ్రూపు నాయకులు నిర్మించారు. చెరువు గర్భంలో సచివాలయ నిర్మాణాన్ని సవాల్ చేస్తూ గ్రామానికి చెందిన కొంతమంది హైకోర్టులో కేసు వేయడంతో చెరువు గర్భంలో నిర్మాణాలు చేపట్టడం నేరమని హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో కృష్ణ మాస్టారే హైకోర్టులో కేసు వేయించారని ఆయనపై ప్రత్యర్థులు మరింత కక్ష పెట్టుకున్నారు. అయితే వైసిపి పెద్దల ఒత్తిడితో సచివాలయానికి నిబంధనలకు విరుద్ధంగా రూ.16లక్షల వరకు అధికారులు బిల్లులు చెల్లించినట్లు చర్చ కూడా సాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే కృష్ణ ఎదుగుదలను జీర్ణించుకోలేని ప్రత్యర్థులు మరడాన మోహనరావు, రెడ్డి రాము , మరడాన వెంకటనాయుడు, మరడాన రామస్వామి, మరడాన గణపతి సినీ ఫక్కీలో ఉపాధ్యాయుడిని హతమార్చేందుకు రెక్కీ నిర్వహించి పక్కా ప్రణాళికతో దారుణానికి పాల్పడ్డారు.

గ్రామంలో తీవ్ర విషాదం

కృష్ణ మాస్టారి హత్యతో ఉద్దవోలు గ్రామంలో ప్రజలు, అధికారులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మాస్టారు మరిలేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న గ్రామస్తులు

రాజకీయ ఎదుగుదలే ప్రాణం తీసింది

ప్రజల అభిమానం, రాజకీయ ఎదుగుదలే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ (58) ప్రాణం తీసింది. గ్రామ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ, గ్రామస్తుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి ఆదారాభిమానాలు పొందడంతో ఓర్వలేని ప్రత్యర్థులు ఉపాధ్యాయుడిని హత్య చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ఏగిరెడ్డి కృష్ణ టిడిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీ బలోపేతానికి పని చేశారు. 1987లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టిడిపి తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. సర్పంచ్‌గా పని చేస్తూ గ్రామస్తులకు అండగా ఉండడంతో ప్రజలు కృష్ణపై అభిమానాన్ని పెంచుకున్నారు. టిడిపి ఎమ్మెల్యే తెంటు జయప్రకాష్‌కు అనుచరుడిగా పనిచేసి నమ్మిన బంటుగా ముద్ర వేసుకున్నారు. 1998 డిఎస్‌సిలో ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఉపాధ్యాయుడుగా పని చేస్తూనే గ్రామంలోను, తెర్లాం మండలంలోను టిడిపి బలోపేతానికి పరోక్షంగా దోహదపడ్డారు. గ్రామంలో కృష్ణ ప్రతిపాదించిన అభ్యర్థులే సర్పంచ్‌లుగా గెలుపొందుతూ వస్తున్నారు. 2004లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత, 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుడు కృష్ణపై రాజకీయ వేధింపులు పెరిగాయి. ఈనేపథ్యంలోనే 2019 ఎన్నికల తర్వాత కృష్ణ తన గ్రూపు వారందరితో కలిసి వైసిపిలో చేరారు. తర్వాత వైసిపి పెద్దలు గ్రామంలోని రెండు గ్రూపులకూ ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ గ్రామంలో కృష్ణ మాస్టారికే ప్రజల మద్దతు ఉండేది.

ఫ్యాక్షన్ రాజకీయాలను జిల్లాకు తేవద్దు

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఫ్యాక్షన్ రాజకీయాలను జిల్లాకు తీసుకురావద్దు అని తెలుగుదేశం పార్టీ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున వైసిపి నాయకులకు హితవు పలికారు. ఆదివారం చీపురుపల్లి టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణను రాజకీయ ఆధిపత్య పోరులో భాగంగా వైసిపి నాయకులు హత్య చేయడం దారుణమన్నారు. ఇలాంటి దుర్ఘటనలు జిల్లాలో ఇంతవరకు జరగలేదన్నారు. అన్నదమ్ముల్లా అందరూ కలిసి ఉండేవారని అన్నారు. ఆ గ్రామంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన కృష్ణను ఎలాగైనా హతమార్చి ఆధిపత్యం సాధించేందుకు కక్ష కట్టి వైసిపి నాయకులు పలువురు సాయంతో హత్యకు పాల్పడ్డారని అన్నారు. ఈ హత్యలో పెద్దలహస్తం ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి దుర్ఘటనలు మరోమారు జిల్లాలో చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. చైతన్య యువజన సేవా సంఘం వ్యవస్థాపకుడు మజ్జి కాంతారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కనపాకలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘువర్మరాజు మాట్లాడుతూ ఇష్టంతో పాటు కటోర శ్రమ, అకుంఠిత దీక్షతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పాటు ప్రణాళిక బద్ధంగా చదివిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. పుట్టుకతో ఎవరూ గొప్పవాళ్ళు కాదని ఒక లక్ష్యంతో కష్టపడితే సమాజంలో గుర్తింపు పొందుతారని అభిప్రాయపడ్డారు. సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ ఎం.మురళి మాట్లాడుతూ మంచి లక్ష్యం, ధృఢ సంకల్పం ఉంటే మంచి విజయాలు సాధించవచ్చని చెప్పారు. అనంతరం 500 మార్కులు పైగా సాధించిన 17 మంది 10వ తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతితో పాటు ఉత్తమ ఫలితాలు సాధించిన 42 మంది 10వ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుజాత విద్యాసంస్థల అధినేత బి.ఎస్.రావు, జిల్లా పోలీస్ సంఘం నాయకులు రామ, అయ్యప్ప కన్స్ట్రక్షన్స్ అధినేత మజ్జి ఆది బాబు, సారిపల్లి అప్పారావు, పొట్నూరు రమేష్ పాల్గొన్నారు.

'చౌకబారు రాజకీయాలు చేయొద్దు'

ప్రజాశక్తి- బొబ్బిలి

చౌకబారు రాజకీయాలు చేయవద్దని టిడిపి నేతలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సూచించారు. వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూల్‌బాగ్ రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశామని చెప్పారు. నిధులు రావడం ఆలస్యమయ్యే అవకాశం ఉండడంతో గోతులను పూడ్చేందుకు మున్సిపల్ నిధులు రూ.40లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేసినట్లు చెప్పారు. మున్సిపల్ నిధులతో గోతులను పూడ్చే పనులు త్వరలో జరగనుండడంతో ఆక్రెడిట్ పొందేందుకు టిడిపి నేతలు పాదయాత్ర చేశారని విమర్శించారు. రాజులను మూడుసార్లు ప్రజలు గెలిపిస్తే ఎందుకు అభివృద్ధి పనులు చేపట్టలేదని ప్రశ్నించారు.

కృష్ణ హత్యపై సమగ్ర విచారణ

ఏగిరెడ్డి కృష్ణ హత్యపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు ఎమ్మెల్యే శంబంగి చెప్పారు. రాజకీయ హత్యని టిడిపి అధినేత చంద్రబాబు అనడం సరికాదన్నారు. ఎప్పటి నుంచో తన ఫాలోవర్‌గా కృష్ణ ఉన్నారని, ఆయన మరణం తనను కలచివేసిందని చెప్పారు. కృష్ణ కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామని చెప్పారు. వ్యక్తిగత కక్షతోనే అదే గ్రామానికి చెందిన వారు హత్య చేశారన్నారు. కృష్ణ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయనతో వైసిపి మండల అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, నాయకులు బొమ్మి అప్పలనాయుడు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పెద్దపీట వేస్తున్నారని నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్ అన్నారు. నగరంలోని 29వ డివిజన్ పరిధి లో సుమారు.52 లక్షల వ్యయంతో కాలువలు, రహదారులు తదితర తొమ్మిది పనులకు సంబంధించి ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం డిప్యూటీ మేయర్లు మాట్లాడుతూ.. శంకుస్థాపన మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు డివిజన్లలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో రహదారులు, కాలువలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాల ను కల్పిస్తున్నట్లు చెప్పారు. 29వ డివిజన్లో ఇప్పటి వరకూ రూ.3 కోట్లకుపైగా పనులు చేపట్టామన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కోలగట్ల నెరవేరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జిలు సంగం రెడ్డి బంగారునాయుడు, కృష్ణారావు ఈశ్వర్ కౌశిక్, డివిజన్ నాయకులు కృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ!

నాలుగేళ్లలో చేపట్టిన సంక్షేమ పాలనను వివరిస్తూ.. ఇంకా చేయాల్సిన పనులపై ఆరా తీస్తూ.. స్థానిక సమస్యలకు పరిష్కారం చూపుతూ ముందుకు సాగారు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి. నగరంలోని ఆరో డివిజన్ 8వ సచివాలయ పరిధిలో ఆదివారం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ప్రగతిని , సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికంగా తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యను కొంతమంది ప్రస్తావించగా.. తక్షణమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కోలగట్ల ఆదేశించారు. మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ ఆల్తి సత్య కుమారి, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగం రెడ్డి బంగారు నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జిలు కృష్ణారావు, బొద్దాన అప్పారావు, డివిజన్ నాయకులు ఆల్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి



ఎన్నికైన జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

హెచ్‌ఎంల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం విజయనగరం జిల్లా శాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వేణుగోపాలరావు, సన్యాసి రాజు ఎన్నికయ్యారు. ఆదివారం హెచ్‌ఎంల అసోసియేషన్ కార్యవర్గ సమావేశం స్థానిక ఫోర్టు సిటీ స్కూల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వి.సత్యనారాయణ వ్యవహరించారు, జిల్లా అధ్యక్షులుగా ఎం. వేణుగోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టి . సన్యాసి రాజు, కోశాధికారిగా బి. సాయి చక్రధర్, గౌరవ అధ్యక్షులుగా కె.సత్యం, రాష్ట్ర కౌన్సిలర్లుగా పిఎజిహెచ్ ఎస్ శ్రీనివాస్, సిహెచ్. రాధాకృష్ణ , అంబల్ల కృష్ణారావు ఎన్నికయ్యారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని, మూడేళ్లగా మంజూరు కాని స్కూల్ గ్రాంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని, నూతనంగా నియమితులైన ఎంఇఒ 2 జీతభత్యాలు, కొత్తగా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల డిడిఒ కోడ్స్‌ను క్రియేట్ చేసి ఆయా పాఠశాలల జీతభత్యాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన డిప్యూటీ ఇఒ పదోన్నతులు తక్షణమే చేపట్టాలని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖ కూచిపూడి కళాకారిణి లిపికా రెడ్డి నృత్యం ప్రేక్షకుల ను అలరించింది. పట్టణంలోని తోట పాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశాఖ కు చెందిన పరిమళ మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అష్టోత్తర శత నృత్య సంగీతార్చన కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ కూచిపూడి నృత్య కళాకారిణి, పరిమళ అకాడమీ డైరెక్టర్ లిపికారెడ్డి కూచిపూడి నృత్యాలనునయన మనోహరంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా లిపికా రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 108 వేంకటేశ్వరస్వామి దేవాలయాలలో నృత్య సంగీతార్చన పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలపించిన కీర్తనలు వీనుల విందు చేశాయి. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో జాతీయ రెడ్డి జెఎసి అధ్యక్షులు ఎమ్. బాలబ్రహ్మారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎమ్‌విఎస్ఎస్ సూర్య భగవాన్ తదితరులులిపికారెడ్డిని ఘనంగా సత్కరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వై.బాలగణేష్, అకాడమీ వ్యవస్థాపకులు కంభాపు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్, సరసమైన ధరల కల్పనే లక్ష్యం

వివిధ రంగాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతోపాటు తద్వారా ఉత్పత్తి చేసిన వస్తు సామగ్రిని సరసమైన ధరలకు ప్రజలు, సంస్థలకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా డిసిఎంఎస్ పనిచేస్తోందని డిసిఎంఎస్ (జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) చైర్‌పర్సన్ అవనాపు భావన అన్నారు. గతంలో డిసిఎంఎస్‌లను పూర్తిగా నిర్వీర్యం చేయడం వల్ల ప్రస్తుతం పరిమితమైన సేవలు అందిస్తున్నామని, దీన్ని అధిగమించేందుకు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంతోపాటు ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహనా సదస్సులు కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. ఇటు ప్రభుత్వ స్కూళ్లకు అవసరమయ్యే డిజిటల్ క్లాస్ రూం మెటీరియల్స్ కూడా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే...


\- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ
- ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు
- ప్రభుత్వ స్కూళ్లకు డిజిటల్ క్లాస్‌రూం మెటీరియల్ పంపిణీ
- రూ.100 కోట్ల స్థిరాస్తులు, రూ.20 కోట్ల టర్నోవర్
- ప్రజాశక్తితో డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన ముఖాముఖి



☞ ప్రస్తుతం డిసిఎంఎస్ పరిస్థితి ఎలా ఉంది?

కార్యకలాపాల నిర్వహణలో విజయనగరం డిసిఎంస్ 5వ స్థానంలో ఉంది. సుమారు రూ.100 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. రాష్ట్రంలో రూ.20కోట్లకుపైగా టర్నోవర్ చేస్తున్న వాటిలో విజయనగరం డిసిఎంఎస్ ఒకటి. స్థిరాస్తులు, ఆర్థిక కార్యకలాపాల ఆధారంగా డిసిఎంఎస్‌ను మరింత అభివృద్ధిచేసి, ప్రజలకు అన్ని విధాలా సహకారం అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. జిల్లాలో విజయనగరం, బొబ్బిలిలో రెండు డిసిఎంస్ బ్రాంచిలు ఉన్నాయి. వీటి ద్వారా ఉత్పత్తుల కొనుగోలు, తద్వారా కొన్ని ఉత్పత్తులను తయారు చేసి సరసమైన ధరలకు విక్రయిస్తున్నాం.



☞ గతంలో డిసిఎంఎస్‌ల పరిస్థితి ఎలా ఉండేది?

గత ప్రభుత్వం డిసిఎంఎస్‌లను పూర్తిగా నిర్వీర్యం చేసింది. వైసిపి అధికారంలోకి వచ్చాక క్రమంగా బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక అందుకనుగుణంగా కృషి చేస్తున్నాను. ముఖ్యంగా రైతులకు ఆధునిక సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాం. ఇటీవల కాలంలో రాగులు, జొన్నలు వంటి మిల్లెట్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇటీవల విజయనగరం జిల్లా కేంద్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల జెసిలు, వ్యవసాయం, అనుబంధం శాఖల అధికారులతో ప్రత్యేక వర్క్‌షాప్ కూడా జరిగిన సంగతి తెలిసిందే.

☞ రైతులకు ఏరకమైన సహకారం అందిస్తున్నారు?

రైతులకు ప్రస్తుతం విత్తనాలు, ఎరువుల పంపిణీ పంపిణీ చేస్తున్నాం. భవిష్యత్తులో విరివిగా పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు కూడా భవిష్యత్తులో పంపిణీ చేసే విధంగా డిసిఎంఎస్‌ను బలోపేతం చేస్తున్నాం. ఇందుకనుగుణంగా ప్రభుత్వం సహకారం అందిస్తోంది.

☞ డిసిఎంఎస్‌లలో కొనుగోలు చేయడం వల్ల లాభం ఏమిటి?

లాభ, నష్టాలతో సంబంధం లేకుండా సహకారం అందించడం డిసిఎంఎస్ లక్ష్యం. అందువల్ల తమ వద్ద విత్తనాలు లేదా ఎరువులు కొనుగోలు చేయడం ద్వారా పెట్టుబడి తగ్గి, ఉత్పత్తి పెంచేందుకు అవకాశం ఉంటుంది. గత ఏడాది డిసిఎంఎస్ ద్వారా 200 మెట్రిక్ టన్నుల సీడ్, ఫెర్టిలేజర్స్ రైతులకు పంపిణీ చేశాం. ఈ ఏడాది కూడా అంతకు మించి విత్తనాలు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. భవిష్యత్తులో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పంపిణీ చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఉంది. ఇటీవల యూరియా వాడకం పెరుగుతున్న నేపథ్యంలో నానో యూరియా అందుబాటులోకి తెస్తున్నాం.

☞ ప్రభుత్వ స్కూళ్లకు కూడా సహకారం అందిస్తున్నారా?

ఔను...! కేవలం వ్యవసాయరంగానికే కాకుండా అన్ని రంగాల్లోనూ తమ సేవలు విస్తరించాలనే సంకల్పంతో ఉన్నాం. అయితే, సిబ్బంది, ఆర్థిక పరిస్థితుల రీత్యా ప్రస్తుతం కొన్ని రంగాల్లో విస్తరిస్తున్నాం. వ్యవసాయంతోపాటు విద్యారంగం కూడా అత్యంత కీలకం కాబట్టి ప్రభుత్వ స్కూళ్లకు డిజిటల్ క్లాస్‌రూం మెటీరియల్ పంపిణీ కొనుగోలు చేసి, బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు విక్రయిస్తున్నాం. ఇప్పటి వరకు విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సుమారు 75స్కూళ్లకు డిజిటల్ క్లాస్ రూంలకు అవసరమైన ప్రొజెక్టర్, మోనిటర్, సిపియు తదితర సామగ్రి ఓపెన్ మార్కెట్ ధరలపై రూ.50 తగ్గించి అందజేశాం. గత ఏడాది కణపాక యూత్ హాస్టల్‌లో డిఆర్‌డిఎ ఆధ్వర్యాన నిర్వహించిన టెక్స్‌టైల్ శిక్షణలో తమ వంతు భాగస్వామ్య మయ్యాం.

☞ పోషకాహారాలు ఉత్పత్తి చేస్తున్నారా?

ఇటీవల కాలంలో మిల్లెట్స్, ఆర్గానిక్ బెల్లంతో డిసిఎంస్ తరపున తిఉబండారాలు తయారు చేస్తున్నాం. వాస్తవవానికి ఇటువంటి ప్రయత్నం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. భవిష్యత్తులో సిబ్బంది, ఇతర అవకాశాలను పెంపొందించుకుని మిల్లెట్స్‌తో తయారుచేసిన తినుబండారాలను మరింత ఎక్కువగా తయారు చేయడం ద్వారా ఇటు రైతులకు మార్కెట్ సదుపాయం, వినియోగదారులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

☞ ఆహార ఉత్పత్తులు ఎవరికి పంపిణీ చేస్తున్నారు?

ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లలో పిల్లలకు ప్రభుత్వం తరపున అందించే న్యూట్రీషన్ ఫుడ్ డిసిఎంస్ ద్వారా తయారుచేసి కొంతమేర పంపిణీ చేస్తున్నాం. ఇందుకోసం రాగులు, జీడి, బెల్లం వంటివి రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రణాళిక తయారు చేశాం. వర్కింగ్ క్యాపిటల్ తక్కువగా ఉండడం వల్ల ప్రయోగాత్మకంగా తొలుత పరిమితమైన ఉత్పత్తులను కొనుగోలు చేసి, కొన్ని శాఖలు, సంస్థలకు మాత్రమే సప్లయి చేయాలని, ఆ తరువాత క్రమంగా విస్తరించాలని భావిస్తున్నాం.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- శృంగవరపుకోట



మాజీ సర్పంచ్ అప్పారావును పరామర్శిస్తున్న కోళ్ల

ఇటీవల మోటారు బైకు మీద నుండి కింద పడి గాయపడిన తెలుగుదేశం పార్టీ ఎస్‌కోట పట్టణ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు కొనదం మల్లేశ్వరరావుని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించారు. గాయం కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మల్లేశ్వరరావుని మాజీ ఎమ్మెల్యే పరామర్శించడంతో పాటు ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఎల్లపుడు ఎటువంటి ఇబ్బంది ఉన్నా పార్టీ ఆదుకుని అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మండలంలోని సంతగైరమ్మపేట మాజీ సర్పంచ్ గోగాడ అప్పారావు కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ, వారి నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న ఆమె వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివిఎస్ నాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు, రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, విశాఖ టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, విశాఖ పార్లమెంటరీ గవర సాధికార సమితి సభ్యులు శిలపరశెట్టి అయ్యప్ప శేఖర్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు వాకాడ బాల ఈశ్వర్ భరత్, సంతగైరమ్మపేట పార్టీ అధ్యక్షులు గోగాడ అప్పలసత్యం, నాయకులు లగుడు వెంకటరావు, కిలపర్తి ముత్యాలనాయుడు, కూనిరెడ్డి శ్రీరామూర్తి, లగుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - వేపాడ

ఈనెల 18వ తేదీన నల్గొండ జిల్లాలో జరగనున్న జాతీయ వికలాంగుల మహాసభ విజయవంత చేయాలని రాష్ట్ర వికలాంగుల ఐక్య పోరాట మెంబర్ కరక వెంకటరావు కోరారు. మండలంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సభకు వికలాంగుల అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక సంఘ సంస్కర్త, వికలాంగుల ఆత్మబంధువు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు.

విత్తన శుద్ధిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని జమ్ముపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం గురించి రైతులకు ఆదివారం వ్యవసాయ సిబ్బంది వివరించారు. బీజామృతంతో వరి విత్తనాలు శుద్ధి చేయడం వల్ల విత్తనం నుండి వచ్చే తెగుళ్లని చీడపీడలు నివారణ, మొలకల శాతం బాగుంటుందన్నారు. భూమి నుండి వచ్చే తెగుళ్ల కూడా నివారిస్తుందని ప్రకృతి వ్యవసాయం కార్యకర్త తెలిపారు. అధిక దిగుబడిన కూడా సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసు, వ్యవసాయం కార్యకర్త సూర్య కుమారి, సంతోష్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. జరజాపుపేటలోని 18వ వార్డులో ఆదివారం ఇంటింటికి వెళ్లి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఉన్న అన్ని క్లస్టర్స్‌లో ప్రతి ఇంటి సమస్యలను తెలుసుకుని ఇందుకు సంబంధించిన పత్రాలను సేకరించి ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చెయ్యాలని సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు, గృహసారథలకు సూచించారు. ఈ నెల 22న 8వ సచివాలయం పరిధిలో ప్రజలకు అవసరమయ్యే ధ్రువపత్రాల జారీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి, గ్రామ పెద్దలు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పాండ్రంకి సత్యనారయణ, మద్దిల ముత్యాలనాయుడు, తాలాడ సన్నిబాబు, ఎఎంసి డైరెక్టర్ పోలుబోతు నారాయణమూర్తి, కో ఆప్షన్ సభ్యులు మాత సంధ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంఘం ప్రతినిధుల రక్తదానం

ప్రజాశకి - నెల్లిమర్ల

ఇండియన్ రెడ్ క్రాస్‌లో సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుభోతు దుర్గాప్రసాద్ ఆదివారం 59వ సారి, గౌరవ అధ్యక్షులు మద్దిల కళ్యాణ్ 21వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మిత్రుడు సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ జన్మదినోత్సవం సందర్భంగా రక్తదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సార్లు రక్తదాత బోడ్డేపల్లి రామకృష్ణారావు, బ్లడ్ బ్యాంక్ స్టాఫ్ పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా రాంబాబు

ప్రజాశక్తి - వేపాడ

స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్‌గా గొర్ల రాంబాబు బాధ్యతలు చేపట్టినట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్. పట్నాయక్ తెలిపారు. గతంలో సాక్షర భారత కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఆయన్ను ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్‌గా నియమించిందన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఫేజ్2 లో రిసోర్స్ కోఆర్డినేటర్‌గా అవుట్ సోర్సింగ్ పద్ధతిపై జాయిన్ అయినట్లు ఆయన తెలిపారు.

భూ హక్కులు కల్పించడంపై హర్షం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాలకు భూ హక్కులు కల్పించడం హర్షణీయమని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఎస్, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు భూ హక్కులు కల్పిస్తూ నిర్ణయం చేయడం హర్షణీయమన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో 51.21 లక్షల మంది లబ్ధిదారులకు 27.42 లక్షల ఎకరాల భూమిపై భూ హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు ఈ వర్గాలకు చెందిన వారిని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.

అనధికార లేఅవుట్‌పై కొరడా

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మేజర్ పంచాయతీ పరిధి, చీపురువలస గ్రామంలోని సర్వేనెంబర్ 57 పిలో 10.36 ఎకరాల్లో ధాత్రివనం పేరుతో ఏర్పాటు చేసిన లే అవుట్‌కు ఎటువంటి విఎంఆర్‌డిఎ, పంచాయితీ అనుమతులు లేవని విఎంఆర్‌డిఎ అధికారులు గుర్తించి, కొత్తవలస పంచాయితీ కార్యదర్శికి చర్యలు నిమిత్తం ఉత్తర్వులు జారీ చేశారు. అనధికారిక లేఅవుట్లపై మేజర్ పంచాయతీ ఇఒ కన్నబాబు ఆధ్వర్యంలో ఇటీవల పంచాయితీ సిబ్బంది ముమ్మరంగా సర్వే నిర్వహించి అనధికార లేఔట్‌ల లిస్ట్ తయారు చేశారు. ఉన్నతధికారుల ఆదేశాల మేరకు చర్యల్లో భాగంగా చీపురువలస వద్ద ఉన్న దాత్రీవనం లేఔట్ ప్రాంగాణంలో పంచాయితీ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ లేఔట్లకు విఎంఆర్‌డిఎ అనుమతులు లేవని, ప్లాట్లు కొని మోసపోవద్దని నిర్మాణానికి పంచాయతీ ఎటువంటి అనుమతులు ఇవ్వరని హెచ్చరిక బోర్డులో పేర్కొన్నారు. విఎంఆర్‌డి అధికారులు ఇచ్చిన తాజా ఉత్తర్వులతో మండలంలోని కొందరు రియల్ వ్యాపారుల గుండెల్లో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ఇతర అనాధికార లేఔట్‌లపై భవిష్యత్‌లో ఏవిధమైన చర్యలుంటాయో అన్న బెంగ అక్రమార్కులను వేదిస్తోంది. అక్రమ లేఅవుట్లు కొనుగోలు చేసిన వారు అన్ని సక్రమంగా ఉన్నవి లేనివి సరిచూసుకొని కొనుగోలు చేయాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.



ధాత్రి వనం వద్ద విఎంఆర్‌డిఎ అతికించిన హెచ్చరిక నోటీసు

ఆరోగ్య కేంద్రం నిర్మించేదెప్పుడు?

- నిధులు మంజూరైనప్పటికీ ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, రోగులు,
- అద్దె కొంపలో నిర్వహణకూ నిరాకరణ

ప్రజాశక్తి- వంగర

పేద ప్రజలకు ప్రభుత్వం నుంచి ఉచితంగా మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మండలంలోని అరసాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులను నియమించారు. నూతనంగా భవనాన్ని నిర్మించేందుకు ఐదు నెలల క్రితం నిధులు మంజూరైనప్పటికీ భవన నిర్మాణ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. దీంతో భవనం లేక ఇటు రోగులు, అటు వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభించి, ఆరోగ్య సేవలు సక్రమంగా అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో మొత్తం 19 సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో 29 పంచాయతీలు, 38 గ్రామాలున్నాయి. సుమారుగా 40 వేలకు పైబడి జనాభా ఉన్నారు. వీరందరికీ ఆరోగ్య సేవలు అందించేందుకు మండల కేంద్రంలో ప్రస్తుతం ఒక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇందులో ఇద్దరు వైద్యులు కూడా ఉన్నప్పటికీ మండలంలో ఉన్న కోనంగిపాడు, కింజంగి, మరువాడ, అరసాడ, శ్రీహరిపురం, బాగేంపేట తదితర గ్రామాలు ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రానికి దూరంగా ఉండటంతో ఆయా గ్రామాలలో గల ప్రజలు వంగరలో గల ఆరోగ్య కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు మండలంలోని అరసాడలో రెండవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు ఐదు నెలల క్రితం నిధులు మంజూరు చేశారు. ఇంత వరకూ బాగానే ఉన్నా నిధులు కేటాయించి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రజా ప్రతినిధులు, అధికారులు అరసాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైందని సభలు సమావేశాల్లో చెప్పడం తప్ప భవన నిర్మాణ పనులను ఎవరూ పట్టించుకోకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఒకరిని డిప్యూటేషన్ పై బయటకు..

అరసాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరుతో ఇద్దరు వైద్యులను నియమించినప్పటికీ భవనం లేకపోవడం వల్ల ఒక వైద్యున్ని డిప్యూటేషన్ పై సంతకవిటి మండలం పంపించారు. మరో వైద్యాధికారి ఉన్నప్పటికీ భవనం లేనందున రోజుకో గ్రామానికి వెళ్లి అక్కడ ప్రజలకు ఆయనకున్న శక్తి మేర వైద్య సేవలందిస్తున్నారు. అదే భవనం ఉంటే ఒకేచోట అందరికీ వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.



ఆస్పత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలం

అద్దె భవనానికి అనుమతి ఇవ్వరు. ప్రభుత్వ భవనం నిర్మించారు..

మండలంలోని అరసాడలో ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇద్దరు వైద్యులను కూడా నియమించింది. భవన నిర్మాణానికి నిధులు కూడా కేటాయించింది. కానీ భవనాన్ని మాత్రం నిర్మించలేదు. అలా అని ప్రస్తుతం అద్దె భవనంలో అయినా ఉండి సేవలందించేందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేనట్లుగా పలువురు చెబుతున్నారు. ప్రభుత్వ భవనం నిర్మించకుండా, అద్దె భవనంలో నిర్వాహణకు అవకాశం ఇవ్వకుండా వైద్యం ఎలా అందిస్తారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరుతో ఇటు రోగులు, అటు వైద్యులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లుగా తెలుస్తుంది. నూతన భవనం నిర్మించేంతవరకు అరసాడలో అద్దె భవనంలో ప్రస్తుతం సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న రోగులు

అసలే ప్రస్తుతం వర్షాకాల కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రిను ఆశ్రయించే రోగులుంటారు. అరసాడలో ఆరోగ్య కేంద్రం భవనం లేనందు వల్ల చాలామంది రోగులు ప్రైవేటు ఆసుపత్రులని ఆశ్రయించి దోపిడీకి గురువుతున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని అరసాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భవన నిర్మాణ పనులు చేపట్టి ఆరోగ్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణ పనులు త్వరలోనే చేపడతాం

అరసాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులకు సంబంధించి ఆర్ అండ్ బి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణ బాధ్యతలను వారే చూస్తున్నారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. పనులు పూర్తయిన వెంటనే పూర్తిస్థాయి సిబ్బంది నియమిస్తాం.

ఎస్. భాస్కరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి, విజయనగరం

రేషన్ కష్టాలు

- ఇప్పటికీ అందని సరుకులు
- వాహనదారుడు డమ్మీ వేలిముద్రలతో వాలంటీర్ నిర్వాకం
- రూ.9 వేలు నెల జీతం ఇచ్చి బియ్యం పంపిణీకి ఒప్పందం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొమిరి గ్రామంలో రేషన్ పంపిణీ చేసే వాహనదారుడు రేషన్ ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వాహనదారుడు అశోక్ రేషన్ లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. రెండు నెలల నుంచి రేషన్ వాహనదారుడు రేషన్ పంపిణీ చేయకుండా వాహనదారుడు డమ్మీ ప్లాస్టిక్ వేలు ముద్రను తయారు చేసి వెంకటాపురానికి చెందిన వాలంటీర్ శివాజీతో రేషన్ సరుకులు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి గాను నెలకు తొమ్మిది వేల రూపాయలు వాలంటీర్‌కు ఇచ్చేందుకు అంగీకరించాడు. వాహనదారుడు వేరే పనుల్లో ఉంటూ ప్రభుత్వం ఇస్తున్న వేతనంలో రూ.9వేలు వాలంటీర్ శివాజీకి ఇచ్చి పంపిణీ చేస్తున్నారు. గత నెల ఏదో విధంగా లబ్ధిదారులు రేషన్ ఇచ్చిన ఇవ్వకపోయినా సరిపెట్టుకున్నారు. జులై నెల ఒకటి నుంచి 15 వరకు వాహనదారుడు రేషన్ పంపిణీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా రేషన్ లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయకపోవడం నానా ఆవస్థలు పడుతున్నారు. వాహనదారుడు అశోక్ డమ్మీ ప్లాస్టిక్ వేలిముద్ర తయారు చేసి వాలంటీర్ శివాజీకి ఇచ్చాడని ఆ వాలంటీరు ప్లాస్టిక్ వేలు ముద్ర పిడిఎస్ బయోమెట్రిక్ యంత్రంలో వేయడం తద్వారా పంపిణీ చేస్తున్నారని రేషన్ లబ్ధిదారులు చెబుతున్నారు. కాగా వాలంటీర్ శివాజీ ఇష్టానుసారంగా వ్యవహరించి కొంతమందికి రేషన్ ఇచ్చి మరి కొంత మందికి రేషన్ ఇవ్వకుండా తిప్పుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. లబ్ధిదారులకు రేషన్ ఇవ్వకుండా మిగులు రేషన్ డీలర్‌కు ఇచ్చేస్తామని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డమ్మీ వేలిముద్రతో పంపిణీ చేయడం నేరమని చెప్పినా వినకుండా పంపిణీ చేయడమే కాకుండా లబ్ధిదారులతో దురుసుగా వ్యవహరిస్తున్నాడని చెబుతున్నారు.



సరుకులు ఇవ్వకుండా ఒక చోట నిలిపివేసిన వాహనం

ఈనెల రేషన్ పంపిణీకి చర్యలు

కొమిరి, వెంకటాపురం రేషన్ పంపిణీ చేసే వాహనదారుడు లబ్ధిదారులకు రేషన్ ఇవ్వడం లేదన్న విషయం ఇంత వరకూ నా దృష్టికి రాలేదు. వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటాం. వాహనదారుడు అశోక్ పై చర్యలు తీసుకుంటాం. వేరే వాహాదారుడితో రేషన్ సరుకులు ఇవ్వని లబ్ధిదారులకు వెంటనే సరుకులు అందజేసేలా చర్యలు తీసుకుంటాం. **- సాయి మహేశ్వరరావు, సిఎస్‌డిటి, రేగిడి.**



తనూజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ట్రిపుల్ ఐటికి తనూజ

ప్రజాశక్తి- దెంకాడ

మండలంలోని అక్కివరం మోడల్ స్కూల్ విద్యార్థిని గుండు తనూజ ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సి.హెచ్. సంధ్య తెలిపారు. తల్లిదండ్రులు బంటుపల్లి గ్రామానికి చెందిన జి.వాణి, జి.సంజీవరావులు సాధారణ వ్యవసాయ కూలీలు, తమ కుమార్తె సాధించిన విజయానికి వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనూజ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికైనందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎస్‌టిలపై చిన్నచూపు

ప్రజాశక్తి- బాడంగి



మాట్లాడుతున్న పాలవలస గౌరు

ఎస్‌టిలపై వైసిపి ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. ఆదివారం తమ నివాసంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎరుకుల పాకాల గ్రామంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక 26 పింఛన్లు పోయాయన్నారు. 35కేజీల ఇచ్చే అంతర్య రేషన్ కార్డులు కూడా పోయాయన్నారు. వివిధ కారణాలు సాకుగా చూపించి తొలిగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌టి పిల్లల చదువులు విషయంలో కూడ గతంలో ఎస్‌టి కార్పొరేషన్ ద్వారా 3వ తరగతి నుండి పై చదువులు చదువుకొనే అవకాశం ఉండేదని, కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అమ్మఒడి పెట్టి ఎస్‌టిలకు సంబంధించిన పథకాలు తీసేసారని అన్నారు. దాని వల్ల చదువులు విషయంలో వెనుక పడి పోయామన్నారు. గత ప్రభుత్వంలో 100 యూనిట్స్ వరకు ఉచితంగా కరెంటు ఇచ్చే వారని, ఈ ప్రభుత్వంలో 100 యూనిట్స్ లోపు వచ్చినా కరెంటు బిల్ వచ్చేస్తుందని చెప్పారు. చేతి వృత్తులు పూర్తిగా కనుమరుగై పోయాయన్నారు. తమ కుల వృత్తి అయిన పిట్టలు వేట ఆడేటప్పుడు పెదపల్లి చెరువులో పాలవలస గౌరు అనే వ్యక్తి మరణిస్తే, పోస్టుమార్టం రిపోర్ట్‌లో బలవంతం చావు అని చూపించి బీమా రాకుండా అధికారులు చేశారన్నారు. చేతి వృత్తులు పోయి ఉపాధి పోయి జీవనం సాగడం కూడ కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్‌టిలను ఆదుకోవాలని కోరారు.

ముగిసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రెండు వారాల ఉపాధ్యాయుల డిజిటల్ విద్యా పద్ధతుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమము ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నిర్వహణాధికారిగా వ్యవహరించిన సాయి చక్రధర్ మాట్లాడుతూ గత పదిహేను రోజులుగా జరిగిన శిక్షణా కార్యక్రమం అద్భుతంగా కొనసాగడానికి సీతమ్ ఇంజనీరింగ్ కళాశాల అందించిన సహకారం ఎనలేదన్నారు. ఈ కార్యక్రమం రాబోవు కాలంలో విద్యా వ్యవస్థను అత్యుత్తమమైనందిగా తీర్చి దిద్దగలదనీ పేర్కొన్నారు. ముఖ్య వక్తలు మధుబాబు, శ్రీనివాస్ డిజిటల్ అంశాలను అతి విపులంగా వివరించారు. ప్రభుత్వం టీచర్ల పైన ఉంచిన భాధ్యత సక్రమంగా నిర్వర్తించడానికి కావలసిన విధంగా మరచి పోలేని విధంగా బోధించారనీ మెట్టవలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొత్స విశాలాక్షి చెప్పారు. ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ్ రావు మాట్లాడుతూ శిక్షణ సీతం కళాశాలలో జరుపడానికి అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇంతటి అద్భుతమైన ప్రాంగణాన్నీ తదితర హంగులనూ ఈ కార్యక్రమానికి అమర్చినందుకు గాను ధన్యవాదాలు తెలుపుతూ ఈ పదిహేను రోజుల కార్యక్రమం నిర్వహించిన శ్రీసాయిచక్రధర్, జ్ఞాపికనందించి శాలువతో మజ్జి శశి భూషణ్ రావును సత్కరించారు



సీతం డైరెక్టర్ శశిభూషణ్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

'గొంప కృష్ణ విద్యాసంకల్పం' పేరుతో ప్రచారం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంతో పాటు ప్రధాన కూడళ్లలో, రోడ్లకు ఇరువైపులా గొంప కృష్ణ విద్యా సంకల్పం పేరుతో కటౌట్ల ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. బొద్దాం నుంచి సోంపురం జంక్షన్ అక్కడి నుండి వేపాడ మండలం కేంద్రం మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు ఈ కటౌట్లు వెలసాయి. ఎస్‌కోటలోని వివేకానంద కాలేజీలో నియోజకవర్గ పరిధిలో గల నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాల కొలువులకు తన వంతు పుస్తక సాయం అనే కటౌట్లు ద్వారా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ప్రచారం చేస్తున్నారు. 100 మార్కులకు ప్రవేశ పరీక్ష (ఆబ్జెక్టివ్) పెట్టి అత్యధిక మార్కులు సాధించిన 175 మందిని ఎంపిక చేస్తారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్, మూడు స్థానాల్లో అధిక మార్కులు సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు ఇస్తారు. నియోజకవర్గ పరిధిలో తెలివైన నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలు (గ్రూప్ 1, గ్రూప్ 2, డిఎస్‌సి, పోలీస్ శాఖ)కు అవసరమైన ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్ అందించి నిరుద్యోగ యువకులకు ఉద్యోగులుగా మార్చాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పరీక్ష ఆగస్టు 6న, ఎస్ కోట, పుణ్యగిరి వద్ద ఉన్న వివేకానంద డిగ్రీ కాలేజీలో నిర్వహించనున్నారు. జూలై 30 లోగా దరఖాస్తులు చేసుకోవాలని గొంప కృష్ణ కోరారు. నియోజకవర్గాన్ని విద్యా నిలయంగా తీర్చి దిద్దాలని తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు సంకల్పంతో ఈ పోటీ పరీక్షలు నిర్వహించి ఫలితాలు సాధించిన నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



గొంప కృష్ణ పేరుతో వెలసిన కటౌట్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బొబ్బిలి

అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభ్యుదయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు ఆర్థోపెడిక్, ఇ.ఎన్.టి, అప్తాలమోజీ, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ సంబంధించి 18 మంది వైద్యులు హాజరై 484 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 54 మందికి శస్త్ర చికిత్స ఉచితంగా చేసేందుకు నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు అభ్యుదయ కరస్పాండెంట్ నాని, ప్రిన్సిపాల్ చింతా శారద చెప్పారు.

ఈనెల 20న ఉచిత దంతవైద్య శిబిరం

బొబ్బిలి: స్థానిక వెలమ కమ్యూనిటీ భవనంలో ఈనెల 20న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ సైనిక ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు చెప్పారు. పాత బొబ్బిలి పెట్రోల్ బంకు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. అనిల్ నీరుకొండ డెంటల్ కళాశాల యాజమాన్యం సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు రూటు కెనాల్ కూడా ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యక్షులు రెడ్డి దామోదర్, రాష్ట్ర ఎంఎస్ఎస్ఎస్ జాయింట్ సెక్రటరీ ఆర్. అప్పలనాయుడు, మాజీ సైనికులు పాల్గొన్నారు.



విద్యార్థికి మందులు అందిస్తున్న ప్రిన్సిపల్ చింతా శారద



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

టిప్పరు, ఆటో ఢీ

ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- గంట్యాడ

రామవరం పెట్రోల్ బంకు వద్ద శనివారం అర్ధరాత్రి టిప్పర్ ఆటో ఢీకొనడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దమజ్జిపాలెం నుండి రాయగడ వెళ్లడానికి ఆటోలో వస్తున్న సమయంలో విజయనగరం నుండి ఎస్.కోట వెళ్తున్న టిప్పర్ ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద ఢీకొనడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమించడంతో వైజాగ్ కేజీహెచ్‌కి తరలించారు. విషయం తెలుసుకున్న గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్ రెడ్డి హుటాహుటిన సంఘట స్థలానికి చేరుకొని పరిశీలించి క్షతగాత్రులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

పరంజపై నుంచి పడి తాపీ మేస్త్రి మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస పంచాయతీ వల్లూరు ప్రైవేట్ లేఅవుట్‌లో బిల్డింగ్ పరంజ్ పై నుంచి ప్రమాదవ శాత్తుపడి తాపీ మేస్త్రీ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. విశాఖ జిల్లా పద్మనాభం మండలం గెద్దపేటకు చెందిన దాసరి తౌడు (57) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. వల్లూరులో భవన నిర్మాణం పనులు చేపడుతుండగా గోడ నిర్మాణం కోసం వేసిన పరంజి పైనుంచి కిందకు పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు తగరపువలస ఎన్నారై ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతునికి భార్య అప్పల నారాయణతో పాటు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడుకు ఇంకా పెళ్లి కాలేదు. కుటుంబాన్ని పోషించాల్సిన యజమాని చనిపోవడంతో భార్యతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బొడ్డవలస గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేశామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.33,840 స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో పేకాట రాయుళ్లు పై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా గ్రామాల్లో పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలన్నారు. ఈయనతో పోలీస్ సిబ్బంది శివ ఉన్నారు.

రాజశేఖర్ మృతిపై అనుమానాలు

- తేల్చలేకపోతున్న పోలీసులు - పలువురిని అదుపులోకి తీసుకుని విచారణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చోల్లంగిపేట గ్రామానికి చెందిన వాతాడ రాజశేఖర్ ఈనెల 7న స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని టిడిపి కార్యాలయం వద్ద అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన తెలిసిందే. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కూడా అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు ఆ కోణంలోనే విచారణ మొదలుపెట్టారు. రాజశేఖర్‌కు ఎక్కువ సంబంధాలు ఎవరెవరితో ఉన్నాయి? ఆరోజు, ముందు రోజు మృతుడు రాజశేఖర్‌తో ఫోన్లోనూ, గ్రామంలోనూ ఎవరెవరు మాట్లాడారు? వాళ్లందర్నీ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నారు. కానీ ఇప్పటికీ అది హత్య, సాధారణ మరణమా తేల్చలేకపోతున్నారు. అక్రమ సంబంధం విషయంలో కూడా విచారణ పోలీసులు పలువురుని అదుపులోనికి తీసుకొని విచారణ చేస్తున్నారు.

పోస్టుమార్టం రిపోర్టులో..

జిల్లా ఆస్పత్రిలో ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో మాత్రం ఊపిరి ఆగిపోవడం వల్ల చనిపోయాడని నిర్ధారించారు. పూర్తి రిపోర్ట్ విజయవాడ నుంచి రావాలని అది వస్తే గాని ఇది హత్య, సాధారణ మరణమా తెలియదని పోలీసులు చెబుతున్నారు. రాజశేఖర్‌కు గతంలో గుండె ఆపరేషన్ అయిందని ఊపిరాడిక చనిపోయి ఉంటాడని గ్రామస్తులు అంటున్నారు.

రాజశేఖర్‌పై పలు ఆరోపణలు

ఎపి జివిబి కుమిలి బ్యాంక్ ద్వారా రాజశేఖర్ గ్రామంలో మినీ బ్యాంకు నడిపేవాడు. గ్రామంలో ప్రజలు బ్యాంకకు వెళ్లలేక లావాదేవీలు మొత్తం ఈయన దగ్గరే జరిపేవారు. గ్రామంలో సుమారు 50 డ్వాక్రా సంఘాలున్నాయి. వీరందరూ పొదుపు అప్పు ఇక్కడే కట్టేవారు. ఇలా సంవత్సరం ఆరు నెలల నుంచి డ్వాక్రా సంఘం సభ్యులు కట్టిన డబ్బులు కుమిలి బ్యాంకకు కట్టకుండా స్వాహా చేశాడని ఆరోపణలున్నాయి. ఈ మధ్యనే పడిన అమ్మఒడి డబ్బులు వేలిముద్ర వేసుకొని తరువాత ఇస్తానని ఇవ్వకుండా ఎగనామం పెట్టినట్లు చెబుతున్నారు. డి. కొల్లం గ్రామానికి చెందిన అమ్మఒడి లబ్ధిదారులు నుంచి రూ.4 లక్షలు, చేరిపోలం నుంచి రూ.2 లక్షలు, చొల్లంగి పేట నుంచి రూ.1.90లక్షలు తల్లుల నుంచి తంబ వేసుకొని బ్యాంకులో డబ్బులు లేవని చెప్పి ఇవ్వలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా రెండు పంచాయతీల్లో పొదుపు సంఘం, అమ్మ ఒడి వివిధ రకాల డబ్బులు అన్ని కలిపి సుమారుగా రూ.30 నుంచి రూ.40 లక్షలు వరకూ ఉంటుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో మినీ బ్యాంకు నడుపుతున్నప్పుడు సంబంధిత బ్యాంకు సెక్యూరిటీ లేకుండా ఎలా నడిపిస్తారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నష్టానికి ఎవరు బాధ్యత పడతారని, బ్యాంకు రూపంలో జరిగింది కాబట్టి తమ సొమ్ము తమకు తిరిగి ఇచ్చే బాధ్యత వహించాలని బ్యాంకును కోరుతున్నారు. స్పందించకపోతే కుమిలి బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తామని బ్యాంకు ఖాతాదారులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ అప్పుల వల్ల ఉక్కిరి బిక్కిరై చనిపోయాడా అక్రమ సంబంధం వల్ల హత్యకు గురయ్యాడా? ఆరోగ్యం బాగాలేక చనిపోయాడా అన్న విషయాలను పోలీసులు తేల్చాల్సి ఉంది.